RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:78 | మార్చి 03, 2026 | వెల: రూ.3-00



# రగులుతున్న మధ్యప్రాచ్యం

## ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణలు తీవ్రరూపం రంగంలోకి ప్రధాని నరేంద్రమోడీ


- అత్యవసర భద్రతా వ్యవహారాల మంత్రివర్గ కమిటీ సమావేశం
- నెతన్యాహు, యూఏఈ అధ్యక్షుడితో ఫోన్ సంభాషణలు
- పౌరుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి
- యూఏఈలోని భారతీయుల భద్రతపై ఆరా
- ఇంధన, ఆర్థిక ప్రభావాలపై సమీక్ష
- రాష్ట్రాలకు అప్రమత్త సూచనలు
- ఖమేనీ మృతి తర్వాత దేశంలో నిరసనలు
- ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయంపై క్షిపణి దాడి
- లెబనాన్‌లో హిజ్బుల్లా నేత మృతి, ఉద్రిక్తతలు పెరుగుదల

**వేద న్యూస్, డెస్క్**

మధ్యప్రాచ్యంలో ఇరాన్–ఇజ్రాయెల్ పరస్పర దాడులతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ దౌత్య పరమైన చొరవ తీసుకున్నారు. ఆదివారం రాత్రి భద్రతా వ్యవహారాల మంత్రివర్గ కమిటీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించి దేశ భద్రతపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో టెలిఫోన్‌లో మాట్లాడిన మోదీ.. యుద్ధ పరిస్థితుల్లో సామాన్య ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకూడదని

మిగతా 2వ పేజీలో..





## రాష్ట్రాలకు హై అలెర్ట్

- ఖమేనీ మృతి తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు
- మతపరమైన ఉద్రిక్తతలపై నిఘా హెచ్చరికలు
- భద్రతా వ్యవహారాలపై కేంద్రం సమీక్ష

2లో



## దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల

- యుద్ధం నేపథ్యంలో నిలిచిపోయిన విమాన రాకపోకలు
- కుటుంబంలో ఒకరికి వైద్యం.. పరామర్శించేందుకు వెళ్లిన మంత్రి
- విమానాలు రద్దు కావడంతో అక్కడే వేచి చూస్తున్న పరిస్థితి

2లో

## ఎస్సీ రిజర్వేషన్లు 18 శాతానికి పెంచాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత





కాళేశ్వరం తీరంలో జేసీబీలతో ఇసుక తోడుతున్న దృశ్యం

# కాళేశ్వరం పునాదులపై ఇసుక మాఫియా పంజా!

2లో

## బ్యారేజ్ పిల్లర్ల పక్కనే జేసీబీల జాతర

- అడ్డగోలుగా తవ్వేస్తున్న ఇసుకాసురులు
- ప్రాణ సంకటంలో ప్రాజెక్టు భవిష్యత్తు
- ప్రభుత్వ ఆస్తులంటే లెక్కలేదా?
- లారీలకు లారీలు తరలుతున్న ఇసుక
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- అధికారుల అండదండలు పుష్కలం

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

కాళేశ్వరం ప్రాజెక్టు పునాదులను పెకిలిస్తూ, స్వార్థపరులైన ఇసుక మాఫియా సాగిస్తున్న అరాచకాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. బ్యారేజ్ పిల్లర్ల పక్కనే జేసీబీల జాతర జరుగుతోంది. క్యూ కట్టిన వందలాది లారీలు.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరాటంకంగా సాగుతున్న ఈ ఇసుక తవ్వకాలు చూస్తుంటే, అసలు ఇక్కడ అధికారులే ఉన్నారా? లేక ఇసుక మాఫియా రాజ్యమేలుతోందా? అనే అనుమానం కలుగుతోంది. ఈ తవ్వకాల వల్ల ప్రాజెక్టు పిల్లర్ల స్టెబిలిటీ దెబ్బతిని, భవిష్యత్తులో భారీ విపత్తుకు దారితీసే అవకాశం ఉందని తెలిసినా, అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతుండటం అత్యంత విషాదకరం. వ్యవస్థకు వెన్నుముకగా ఉండాల్సిన అధికారులే.. మాఫియాకు అండదండలు అందిస్తుంటే, ఈ విధ్వంసాన్ని ఆపేదెవరు? కొంత మంది అధికారుల ప్రోత్సాహంతో జరుగుతున్న ఈ దందా వెనుక ఉన్న అసలు కుట్ర ఏమిటి? కాళేశ్వరం పునాదులను పెకిలిస్తున్న ఇసుకాసురుల అరాచకాలపై 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం..



కాళేశ్వరం బ్యారేజ్ పిల్లర్ల వద్ద ఇసుక తోడి లారీల్లో తరలిస్తున్న దృశ్యం



## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

- దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది
- సమర్థంగా ఎదుర్కొనే నాయకత్వం అవసరం
- దేశ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ బలపడాలి
- ప్రజా జీవితంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నాను
- వికారాబాద్ వేదికగా సీఎం రేవంత్ పిలుపు

2లో



## మత్తు చాక్లెట్లు ఇచ్చి.. విద్యార్థినిపై లైంగిక దాడి?

- డార్క్ వెబ్ ద్వారా చాక్లెట్లు, మాత్రలు..
- బాచుపల్లిలో విద్యార్థినిపై దారుణం
- ఆత్మహత్యాయత్నంతో వెలుగులోకి ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలి తల్లి

2లో

వేద న్యూస్

మంగళవారం | మార్చి 03, 2026

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

- దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది
- సమర్థంగా ఎదుర్కొనే నాయకత్వం అవసరం
- దేశ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ బలపడాలి
- ప్రజా జీవితంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నాను
- వికారాబాద్ వేదికగా సీఎం రేవంత్ పిలుపు



**వేద న్యూస్, వికారాబాద్**

లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని దేశ ప్రధాని పీఠంపై చూడడమే తమ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వికారాబాద్‌లో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. దేశం ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటిని సమర్థంగా ఎదుర్కొనే నాయకత్వం అవసరమని రేవంత్ పేర్కొన్నారు. ఆ బాధ్యతను నిర్వర్తించగల సామర్థ్యం రాహుల్ గాంధీకి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ బలపడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి, ప్రజల సమస్యలను ఎత్తిచూపాలని సూచించారు. ప్రజా జీవితంలో తాను ఎప్పుడూ పైరవీలు చేయలేదని రేవంత్ స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై గళం విప్పినందుకు తనపై అనేక కేసులు నమోదయ్యాయని గుర్తుచేసుకున్నారు. ఆదివారం కూడా కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. గత 19 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. పార్టీ పదవులు నిర్వహిస్తూ, ఎమ్మెల్యేగా అనుభవం సంతరించుకున్నానని వివరించారు. తనపై పరువు నష్టం దావాలు, కేసులు పెట్టినా వెనక్కి తగ్గలేదని రేవంత్ అన్నారు. దేశ సమస్యలపై రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ఐదేళ్ల కృషి ఫలితంగానే రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా నిలిచారని చెప్పారు. దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలంటే రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పని చేయాలని డీసీసీ అధ్యక్షులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు.

# మత్తు చాక్లెట్లు ఇచ్చి.. విద్యార్థినిపై లైంగిక దాడి?

- డార్క్ వెబ్ ద్వారా చాక్లెట్లు, మాత్రలు..
- బాచుపల్లిలో విద్యార్థినిపై దారుణం
- ఆత్మహత్యాయత్నంతో వెలుగులోకి ఘటన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలి తల్లి

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలోని బాచుపల్లిలో ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిందన్న ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఆశిష్ అనే విద్యార్థి మత్తుమందు కలిపిన చాక్లెట్లు, మాత్రలు ఇచ్చి కాలేజీ, హోటళ్లలో దాడులకు పాల్పడినట్లు బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఏడాదిగా ఏఎన్‌సీ అనే డార్క్ వెబ్ వేదిక ద్వారా తన కూతురికి చాక్లెట్లు, టాబ్లెట్లు పంపించి మాయమాటలతో వేధింపులకు గురిచేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆశిష్‌తో పాటు అతని స్నేహితుడు ప్రవీణ్ కూడా వరుసగా లైంగిక దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. తాను చెప్పినట్టు చేయకపోతే న్యూడ్ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించాడని బాధితురాలి తల్లి ఆరోపించారు. ఈ విషయంపై కాలేజీ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ సరైన స్పందన రాలేదని పేర్కొన్నారు. శనివారం విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలికి అవసరమైన వైద్య, మానసిక సహాయం అందిస్తున్నట్లు సమాచారం. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఎస్సీ రిజర్వేషన్లు 18 శాతానికి పెంచాలి

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్లు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో స్పష్టమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉపకులాల నాయకులతో సమావేశం నిర్వహించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తీర్మానం చేయాలని ఆమె కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలు ప్రక్రియలో భాగంగా కేంద్రం చేపట్టే జనగణన పూర్తై అధికారిక లెక్కలు వెలువడిన తర్వాత రిజర్వేషన్ల పెంపు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిందని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా రిజర్వేషన్ల పెంపు అంశంపై అసెంబ్లీలో స్పష్టమైన తీర్మానం ఆమోదించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎస్సీ ఉపకులాలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ తగిన ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర అభివృద్ధి కోసం ఉపకులాల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

# కాళేశ్వరం పునాదులపై ఇసుక మాఫియా పంజా!

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

- బ్యారేజ్ పిల్లర్ల పక్కనే జేసీబీల జాతర
- అడ్డగోలుగా తవ్వేస్తున్న ఇసుకాసురులు
- ప్రాణ సంకటంలో ప్రాజెక్టు భవిష్యత్తు
- ప్రభుత్వ ఆస్తులంటే లెక్కలేదా?
- లారీలకు లారీలు తరలుతున్న ఇసుక
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- అధికారుల అండదండలు పుష్కలం

కాళేశ్వరం ప్రాజెక్టు.. కోట్లాది రూపాయల ప్రజాధనంతో, అత్యున్నత అద్భుతంగా నిర్మితమైందని ప్రభుత్వం చెప్పుకున్న వేదిక. కానీ, నేడు అదే ప్రాజెక్టు పునాదులు ఇసుక మాఫియా పంజాలో చిక్కుకున్నాయి. బ్యారేజ్ పిల్లర్లకు అతి సమీపంలో, ఎలాంటి భద్రతా నిబంధనలు పాటించకుండా, నిబంధనలను తుంగలో తొక్కి భారీ జేసీబీల సాయంతో ఇసుకను తరలిస్తున్నారు. ప్రాజెక్టును కాపాడాల్సిన చోట, ఆ ప్రాజెక్టు బతికే పునాదులను తవ్వి అమ్ముకుంటున్న ఈ అరాచక చూస్తుంటే వ్యవస్థ, అధికారులు ఎంతటి నిర్లక్ష్యంతో ఉన్నారో అర్థం అవుతోంది.

### పునాదులనే పెకిలిస్తున్నారా?

కాళేశ్వరం బ్యారేజ్ పిల్లర్ల పక్కనే ఇసుకను జేసీబీలతో తవ్వి, లారీల్లో నింపుతున్నారు. ఒక ఇంజనీరింగ్ స్ట్రక్చర్ పటిష్టంగా ఉండాలంటే దానికి అవసరమైన బేస్ ఎంతో కీలకం. కానీ, ఆ బేస్ చుట్టూ ఉన్న ఇసుకను ఇలా యంత్రాలతో అడ్డగోలుగా తవ్వేయడం వల్ల, భవిష్యత్తులో భారీ వరదలు వచ్చినప్పుడు పిల్లర్ల స్టెబిలిటీ దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ ఇసుక తవ్వకాలు కేవలం వ్యాపారం కాదు, ఇది ఒక ప్రాజెక్టు మనుగడనే ప్రశ్నార్థకం చేసే ప్రమాదకరమైన చర్య. ఇసుక అక్రమ రవాణా చేసే వ్యక్తులకు, ప్రాజెక్టు భద్రత కంటే కళ్లముందు కనిపిస్తున్నా లాభమే ముఖ్యమని ఈ తవ్వకాలు స్పష్టం చేస్తున్నాయి.

### అధికారుల మౌనం.. అసలు వ్యవస్థ ఎక్కడ?

రాష్ట్రంలోని అత్యంత కీలకమైన ప్రాజెక్టు వద్ద ఇన్ని భారీ యంత్రాలు పనిచేస్తుంటే, లారీలు క్యూ కట్టి ఇసుకను తరలిస్తుంటే.. అక్కడి అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారు? పగలు, రాత్రి తేడా లేకుండా జరుగుతున్న ఈ దందా, అధికారుల అండదండలు లేకుండా సాధ్యమయ్యే పని కాదు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం కాంక్రీట్ కట్టడం కాదు, అది తెలంగాణ రైతాంగం ఆశల సౌధం. అటువంటి ప్రాజెక్టు వద్దే ఇసుక మాఫియా రాజ్యమేలుతోందంటే, రాష్ట్రంలో పాలన ఎంతటి సంక్షోభంలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

### ప్రభుత్వ ప్రోత్సాహమా.. లేక కుట్రనా?

ఈ అక్రమ తవ్వకాలను చూస్తుంటే, ప్రభుత్వం నిజంగానే ఇసుక మాఫియాపై కఠినంగా ఉందా? లేదా మౌనంగా ఈ విధ్వంసానికి సహకరిస్తోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టును ఎలాగైనా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. కానీ, కళ్లముందే ప్రాజెక్టు పునాదులు బలహీనపడుతుంటే చూస్తూ ఊరుకోవడం, నిర్లక్ష్యానికి పరాకాష్ట. ప్రాజెక్టుల భద్రత విషయంలో రాజీ పడితే, దాని పరిణామాలు ఊహకందని స్థాయిలో ఉంటాయి. రేపు ఏదైనా విపత్తు జరిగితే, ఎవరు బాధ్యత వహిస్తారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

### ఇప్పుడే ఆపకపోతే.. భారీ మూల్యం!

ఈ తవ్వకాలను ఇప్పుడే నిలిపివేయాలి. అక్రమాలకు పాల్పడుతున్న వారిని, వారికి సహకరిస్తున్న అధికారులను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు కనీసం ఈ అక్రమ తవ్వకాలను ఆపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అక్రమ తవ్వకాలు, ఈ మాఫియా దందాలు చూస్తుంటే.. కాళేశ్వరం ప్రాజెక్టును ఇసుక మాఫియా ఆశలకు బలి ఇస్తున్నారా అని ప్రజలు భయపడుతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని, ప్రాజెక్టు భవిష్యత్తును కాపాడాలని పర్యావరణ వాదులు కోరుతున్నారు.




కాళేశ్వరం బ్యారేజ్ పిల్లర్ల వద్ద జేసీబీతో ఇసుక తోడి లారీల్లో తరలిస్తున్న దృశ్యం

# రగులుతున్న మధ్యప్రాచ్యం

## ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణలు తీవ్రరూపం

**మొదటి పేజీ తరువాయి**

ఘర్షణలను వీలైనంత త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శాంతి స్థాపనకు భారత్ సహకరించేందుకు సిద్ధమని తెలిపారు. అలాగే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు మహ్మద్ బిన్ జయేద్ అలీ నహ్యాన్ తో కూడా మాట్లాడి ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ నివసిస్తున్న వేలాది భారతీయుల భద్రతపై ఆరా తీసి, వారికి అందుతున్న సహకారంపై కృతజ్ఞతలు తెలిపారు.

### దేశ భద్రతపై సమీక్ష

మంత్రివర్గ కమిటీ సమావేశంలో ఇంధన సరఫరాలు, అంతర్జాతీయ చమురు ధరల ప్రభావం, విదేశాల్లో ఉన్న భారతీయుల తరలింపు చర్యలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. పశ్చిమాసియాలో ఏ మార్పు వచ్చినా భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశమున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



### ఇరాన్ క్షిపణి దాడులు

తమ సుప్రీం నాయకుడి మృతికి ప్రతీకారం తప్పదని ప్రకటించిన ఇరాన్ విప్లవ రక్షక దళాలు.. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణి దాడి చేసినట్టు ప్రకటించాయి. దీనిపై ఇజ్రాయెల్ సైన్యం రక్షణ వ్యవస్థలు ముప్పును అడ్డుకుంటున్నాయని తెలిపింది. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ యుద్ధ వాతావరణంలో వందలాది మంది మరణించినట్లు సమాచారం.

### లెబనాన్‌లో ఉద్రిక్తతలు


లెబనాన్‌లో హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు తీవ్రతరం అయ్యాయి. హిజ్బుల్లా బ్లాక్ అధిపతి మహమ్మద్ రాద్ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ వర్గాలు వెల్లడించాయి. సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# రాష్ట్రాలకు హై అలెర్ట్

- ఖమేనీ మృతి తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు
- మతపరమైన ఉద్రిక్తతలపై నిఘా హెచ్చరికలు
- భద్రతా వ్యవహారాలపై కేంద్రం సమీక్ష

**వేద న్యూస్, డెస్క్**

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, అమెరికా–ఇరాన్ మధ్య రేగిన యుద్ధ ప్రభావం అంతర్జాతీయ సరిహద్దులను దాటి భారత్‌లో కూడా ప్రతిఫలిస్తోంది. ఇరాన్ అత్యున్నత ఆధ్యాత్మిక నేత అయతొల్లా అలీ ఖమేనీ మృతి నేపథ్యంలో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా దేశీయంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను హై అలర్ట్ చేసింది. ముఖ్యంగా ఇరాన్ అనుకూల తీవ్రవాద శక్తులు మతపరమైన ప్రార్థనా స్థలాలు లేదా బహిరంగ సభలను వేదికగా చేసుకుని రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో కేంద్ర హోం శాఖ రాష్ట్రాల పోలీసు విభాగాలకు అత్యవసర లేఖలు పంపింది. మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా గూఢచారి విభాగాల మధ్య సమాచార మార్పిడిని వేగవంతం చేయాలని, సున్నిత ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేయాలని ఆదేశించింది. ఖమేనీ మృతికి నిరసనగా ఢిల్లీ, లక్నో, శ్రీనగర్ వంటి నగరాల్లో భారీ ఎత్తున ఆందోళనలు చోటుచేసుకున్నాయి. ఈ నిరసనలను అదుపులో ఉంచేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. పరిస్థితులను అదునుగా తీసుకుని అరాచక శక్తులు హింసకు ప్రేరేపించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలో మారుతున్న సమీకరణాలను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గత రాత్రి ఆయన నేతృత్వంలో జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ప్రస్తుత యుద్ధ వాతావరణంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. దేశ భద్రత, అంతర్గత శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.



# దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**వేద న్యూస్, హైదరాబాద్**

- యుద్ధం నేపథ్యంలో నిలిచిపోయిన విమాన రాకపోకలు
- కుటుంబంలో ఒకరికి వైద్యం కోసం వెళ్లిన మంత్రి
- విమానాలు రద్దు కావడంతో అక్కడే వేచి చూస్తున్న పరిస్థితి

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రస్తుతం దుబాయ్‌లో చిక్కుకుపోయారు. ఊహించని పరిణామాల నేపథ్యంలో ఆయన స్వదేశానికి తిరిగి వచ్చే అవకాశం లేకుండా పోయింది. గత ఐదు రోజుల క్రితం, తన కుటుంబ సభ్యులలో ఒకరికి మెరుగైన వైద్యం అందించే నిమిత్తం మంత్రి అత్యవసరంగా దుబాయ్‌కు వెళ్లారు. చికిత్స ప్రక్రియ సజావుగా సాగుతున్న తరుణంలో, అక్కడ జరిగిన అవాంఛనీయ ఘటనలు మంత్రి తిరుగు ప్రయాణానికి ఆటంకంగా మారాయి. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంపై దాడులు జరిగినట్లు వార్తలు రావడంతో అక్కడ భద్రతను అత్యున్నత స్థాయికి పెంచారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా, అక్కడి ప్రభుత్వం ముందు జాగ్రత్తగా అన్ని అంతర్జాతీయ విమాన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసింది. విమానాశ్రయం పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో, సాధారణ ప్రయాణికులతో పాటు అనేక మంది విదేశీయులు కూడా అక్కడ నిలిచిపోయారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రస్తుతం సురక్షితంగానే ఉన్నారని సమాచారం. అయితే, ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలు ఎప్పుడు పునరుద్ధరిస్తారనే విషయంపై అక్కడి అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఎయిర్‌పోర్టుకు క్లియరెన్స్ లభించే వరకు ఆయన తిరిగి ఇండియాకు వచ్చే పరిస్థితి లేదు. దీనివల్ల ఆయన తన పర్యటనను పొడిగించుకోవాల్సి వస్తోంది. మంత్రి దుబాయ్‌లో చిక్కుకున్నారనే వార్త తెలియగానే రాష్ట్రంలోని ఆయన అభిమానులు, అనుచరులు, పార్టీ శ్రేణులు కొంత ఆందోళనకు గురవుతున్నారు. అయితే, మంత్రి తుమ్మల తన కుటుంబ సభ్యులతో క్షేమంగానే ఉన్నారని, అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే ఆయన తిరిగి వస్తారని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. పరిస్థితులు చక్కబడిన వెంటనే ఆయన హైదరాబాద్‌కు చేరుకుంటారని ఆశిస్తున్నారు.



వేద న్యూస్

మంగళవారం మార్చి 03, 2026

# కౌన్సిలర్ గా కేరళ స్కూల్ పూర్వ విద్యార్థి ఫిరోజ్

## - ఘనంగా సన్మానించిన పాఠశాల కరెస్పాండెంట్ బెన్నీ

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణ పురపోరులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి కౌన్సిలర్ గా ఘన విజయం సాధించిన ఫిరోజ్ ను ఆయన చిన్ననాటి నుండి చదువుకున్న " "కేరళ మోడల్ హై స్కూల్" యాజమాన్యం పాఠశాలకి ఆహ్వానించి ఘనంగా సన్మాన కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేసింది. పాఠశాల కరెస్పాండంట్ కె ఎస్ బెన్నీ మాట్లాడుతూ.. తమ పూర్వ విద్యార్థి ఫిరోజ్ చిన్ననాటి నుండి క్రమశిక్షణతో ఉంటూ.. ఉన్నత చదువులు చదివి నేడు రాజకీయం వైపు అడుగులు వేసి.. ప్రజల మన్ననలు పొంది ..బీ- ఫాం ఇవ్వకపోయినా పట్టుదలతో ఇండిపెండెంట్ గా పోటీ చేసి... కౌన్సిలర్ గా విజయం సాధించడం అనేది తమ విద్యాసంస్థకి గర్వకారణంగా భావిస్తున్నాం అని కొనియాడారు. ఒక సామాన్యుడు పట్టుదలతో కష్టపడితే.. విజయం తమ సొంతం అవుతుంది అనే దానికి ఒక ఉదాహరణ కూడా ఫిరోజ్ సెట్ చేసాడు అని అన్నారు.అనంతరం ఫిరోజ్ మాట్లాడుతూ.. తాను చిన్ననాటి నుండి చదివిన పాఠశాల అసెంబ్లీ లో పాల్గొనడం, తరగతి గదులను చూస్తూ.. తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ గొప్పగా భావిస్తున్నానని, భావోద్వేగానికి లోనయ్యారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. తాను చిన్ననాటి నుండి ఇదే స్కూల్ లో 10వ తరగతి వరకు చదువుకున్నాననీ ,నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, సేవా భావం.. ఇదే కేరళ స్కూల్ లో తన గురువులు నేర్పారని చెప్పారు. వారి నుండే నేను సేవా భావం అలవర్చుకున్నాననీ, "హార్డ్ వర్క్ నెవెర్ ఫెయిల్స్" అని, కష్టపడి చదవాలని, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని పేర్కొన్నారు . తల్లిదండ్రులను ఉన్నతంగా చూసుకోవాలని, క్రమశిక్షణ, క్యారెక్టర్ బాగుంటే మన జీవితాల్లో చాలా గొప్ప మార్పులు వస్తాయని చెప్పుకొచ్చారు. కష్టం లేనిది ఫలితం ఆశించలేమని. కష్టపడితేనే ఉన్నత శిఖరాలకు చేరుతాం అని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలి

## - కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన చిత్రా మిశ్రా ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కోకన్వీనర్, జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఫెడరేషన్ డైరీనీ కలెక్టర్ కు అందించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కలెక్టర్ కు వివరించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గాదె కరుణాకర్ రావు, నరేందుల ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి కిరణ్, నాయకులు సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం

## - హాజరైన కౌన్సిలర్ మౌనిక అనిల్



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపూర్ అంగన్ వాడి కేంద్రంలో సోమవారం కౌన్సిలర్ పాత కాల మౌనిక అనిల్ సమక్షంలో.. అంగన్ వాడి స్థాయి పర్యవేక్షణ, సహాయక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్..గర్భిణులు, బాలింతలు కేంద్రానికి వచ్చి రోజు భోజనం చేయవలసిందిగా సూచించారు. గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమములో 15 వ వార్డ్ కేశవపూర్ మున్సిపల్ కౌన్సిలర్ మౌనిక - అనిల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బైరి సురేష్ ,అంగన్ వాడి టీచర్ శివభారతి , హెల్పర్ సునీత, తల్లి తండ్రులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

# అ'పూర్వ' సమ్మేళనం

## - 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎస్సీ 2000-2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించి, తమకు విద్యాబోధన చేసిన గురువులను శాలువాలతో సన్మానించారు. అకాల మరణం చెందిన సహచరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు. అధ్యాపకులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నూతన ఉత్సాహాన్ని కలిగిస్తాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై



దృష్టి పెట్టాలని, పోటీ పరీక్షలకు సిద్ధమవాలని సూచించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. గురువుల మార్గదర్శకత్వమే తమ విజయాలకు కారణమని పేర్కొన్నారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బ్యాచ్ సభ్యులను గురువులు అభినందించారు.

# డ్రైనేజీ పరిశీలన

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డును స్థానిక కౌన్సిలర్ గుర్రం కావ్య పరశురామ్ ఆహ్వానం మేరకు వెళ్లి వార్డును మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ సోమవారం సందర్శించారు.రైల్వే స్టేషన్ పరిసరప్రాంత వాసుల రోడ్డు, డ్రైన్ సమస్య తెలుసుకొని త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చి.. స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల సంఖ్య, వారికి అందిస్తున్న రోజువారి ఆహార పదార్థాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆమంచా వెంకటేష్, సలీం,నాగేష్,శ్రీకాంత్,భాస్కర్ అశోక్, శీను,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోవాలి

- ఎవరికీ ఇబ్బందులు కలిగించొద్దు
- డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా ప్రజలు హోలీ పండుగను ఆనందంగా, సురక్షిత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. యువకులు అత్యుత్సాహంతో ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్, స్టంట్లు చేయడం, ముగ్గురునలుగురు ఒకే వాహనంపై ప్రయాణించడం, సైలెన్సర్ తొలగించి బైక్‌లు నడపడం వంటి ప్రమాదకర చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసిన ఎస్పీ, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో తల్లిదండ్రులు, వాహన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఇతరులపై బలవంతంగా రంగులు వేయడం, అసభ్య ప్రవర్తన, మహిళల వేధింపులు, గొడవలు, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హోలీ అనంతరం చెరువులు, కాల్వలు, లోతైన నీటిలో స్నానాలకు వెళ్లడం ప్రమాదకరమని సూచించారు. పరస్పర గౌరవంతో, మతసామరస్యాన్ని కాపాడుతూ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# దేవుని తండా విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

## - ఏఈకు సర్పంచ్ భూక్యా మోహన్ వినతి

**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని దేవుని తండాలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ భూక్యా మోహన్ సోమవారం విద్యుత్ శాఖ ఏఈ మహేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తండాలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులపై కొత్త డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) సిద్ధం చేయాలని కోరారు. విద్యుత్ స్తంభాలు లేని ప్రాంతాలను గుర్తించి వెంటనే కొత్త పోల్స్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి నాణ్యమైన విద్యుత్ అందించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ విన్నపంపై ఏఈ మహేష్ సానుకూలంగా స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు భూక్యా గబ్బర్ సింగ్, తండా ప్రముఖులు పాల్గొన్నారు.

# సెస్ ఉద్యోగుల 72 గంటల విధుల బహిష్కరణ

## - ఈ నెల 11 నుంచి 14 వరకు ఆందోళన కార్యక్రమాల
## - సమస్యల పరిష్కారంలో జాప్యానికి నిరసన

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

సెస్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ హెల్పర్లు, ఇతర ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతున్నందుకు నిరసనగా ఈ నెల 11 నుంచి 14 వరకు 72 గంటలు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కే. ఈశ్వర్ రావు, కార్యదర్శి నలువాల స్వామి ప్రకటించారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సెస్ ఎండీకి ఐదుసార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. ప్రతి నెల ఇవ్వాల్సిన ఎఫ్‌టీఏ ఎనిమిది నెలలుగా నిలిపివేశారని, 2025 సెప్టెంబర్‌లో ఇవ్వాల్సిన వార్షిక ఇన్క్రిమెంట్ మంజూరు చేయలేదని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను రెగ్యులరైజ్ చేయలేదని, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ అమలు చేయడం లేదని విమర్శించారు. ఐటీఐ ఎలక్ట్రికల్ అర్హత ఉన్న కార్మికులను "అసిస్టెంట్ హెల్పర్లు"గా పిలవడం వారి ఆత్మగౌరవానికి అవమానమని పేర్కొన్నారు. తక్కువ వేతనాలు ఇవ్వడం వంటి కార్మిక వ్యతిరేక విధానాలు కొనసాగుతున్నాయని తెలిపారు. విధుల




బహిష్కరణ కాలంలో వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామని, సెస్ చైర్మన్, ఎండీలు యూనియన్‌తో చర్చించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సెస్ కమిటీ అధ్యక్షుడు కర్నాల అనిల్ కుమార్, కార్యదర్శి ఎస్. శ్రీనివాసరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర మల్లేశం, కోశాధికారి ఎస్. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు

## - ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి బాలపోచయ్య, పసుల వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని పలు ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ధన్వవాడ గ్రామ సర్పంచ్‌గా రాజకీయ జీవితం ప్రారంభించిన శ్రీపాదరావు, మంథని నుంచి శాసనసభ్యునిగా, అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్‌గా సేవలందించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రజా జీవితంలోనూ మచ్చలేని నాయకుడిగా ఆయనకు గుర్తింపు లభించిందని, "అజాత శత్రువు"గా పేరు సంపాదించారని కొనియాడారు. కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెంద్యాల వెంకట్ రెడ్డి, మైనార్టీ మండల అధ్యక్షుడు జమాల్, సోషల్ మీడియా అధ్యక్షుడు కాసుపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మార్చి 03, 2026

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీవో



**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి:**

మెట్‌పల్లి డివిజన్ ఆర్డీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జి. నరసింహారావు సోమవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీవో పుష్ప గుచ్ఛం అందజేయగా, కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందిం చేందుకు కట్టుబడి పనిచేయాలని, రెవెన్యూ సమస్యలను సమయానికి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి పరిపాలన యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

- చెక్కు అందజేసిన సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి



**వేద న్యూస్, కోనరావుపేట:**

కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన అనుముల మహేందర్ ఆరు నెలల క్రితం పొలంలో గడ్డి కోస్తుండగా విద్యుత్ తీగలకు మిషన్ తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై మరణించారు. ఈ ఘటనను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సెస్ సహకార విద్యుత్ సరఫరా సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును సోమవారం సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి మృతుని భార్య మమతకు అందజేశారు. ఈ సందర్భంగా దేవరకొండ తిరుపతి మాట్లాడుతూ అనుకోని విద్యుత్ ప్రమాదాలకు గురైన కుటుంబాలకు సెస్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమ్మరి స్వప్న, ఉపసర్పంచ్ మానుక సత్యం, నాయకులు తిరుపతి, మానుక రాజు, భాస్కర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మల్యాల మనోజ్ కుమార్, వాళ్యా నాయక్, పారేళ్ల రాజు, దప్పుల శ్రీకాంత్, కడారి శ్రీనివాస్, సెస్ ఏఈ దివ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్ మెన్ రాములు, అసిస్టెంట్ హెల్పర్ చందు తదితరులు పాల్గొన్నారు.

## రోబోటిక్స్ మేళాలో సత్తా చాటిన కాసిపేట విద్యార్థులు



**వేద న్యూస్,కాసిపేట:**

మండలంలోని కాసిపేట మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన రోబోటిక్స్ మేళాలో విశిష్ట ప్రతిభ కనబరిచి అవార్డు సాధించారు. హైదరాబాద్‌లోని మిని శిల్పారామంలో సోహం అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 5వ వార్షిక రోబోటిక్స్ మేళాలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 20 పాఠశాలల ప్రాజెక్టుల మధ్య కాసిపేట మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రాజెక్ట్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. 9వ తరగతికి చెందిన పి. త్రిశూల్, ఈ. చైత్ర, మనస్విని, అభివృద్ధిని, రిత్విక్, సహస్ర మరియు 8వ తరగతికి చెందిన వరుణి, శ్రీరామ్, నేహా, సుజిత్ విద్యార్థులు రూపొందించిన “పంటల సంరక్షణలో రోబోటిక్స్ వినియోగం” అనే ప్రాజెక్ట్ జడ్జీలను ఆకట్టుకుంది. వ్యవసాయంలో పంటల రక్షణకు సాంకేతికతను ఎలా వినియోగించుకోవచ్చో ఈ ప్రాజెక్ట్ ద్వారా వివరించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు స్వప్నారాణి మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్ట్ రూపొందించబడింది. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డు సాధించిన విద్యార్థులను, గైడ్ టీచర్ స్వప్నారాణి ని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇంచార్జీలు రాకేష్, గణేష్ మరియు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మాట్లాడుతూ విద్యార్థులు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో అందుబాటులో ఉన్న రోబోటిక్స్ పరికరాలను సద్వినియోగం చేసుకుని సమాజానికి, దేశానికి ఉపయోగపడే వినూత్న ఆవిష్కరణలు చేయాలని సూచించారు. విద్యార్థుల ఈ విజయంతో పాఠశాలకు మరింత ప్రతిష్ట లభించిందని తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహ ధ్వంసం ఘటనపై ఉద్రిక్తత

- నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి
- ధ్వంసమైన విగ్రహాన్ని తక్షణమే పునఃప్రతిష్ఠించాలి
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**వేద న్యూస్, జగిత్యాల:**

జగిత్యాల పట్టణంలోని మున్సిపల్ వార్డు నెం.18 కల్చివాడ ఎస్సీ కాలనీలో డాక్టర్ బాబా సాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన ఉద్రిక్తతలకు దారి తీసింది. ఫిబ్రవరి 24న జరిగిన ఈ ఘటనపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. విగ్రహంతో పాటు చుట్టూ ఉన్న నిర్మాణాన్ని కూడా పాడుచేశారని తెలిపారు. జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతను అవమానించడమే కాకుండా సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యగా ఈ ఘటనను అభివర్ణించిన ఆయన, నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనకు ఉపయోగించిన వాహనం సహా అన్ని ఆధారాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ధ్వంసమైన విగ్రహాన్ని తక్షణమే పునఃప్రతిష్ఠించి శాశ్వత నిర్మాణంగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడే దిశగా పరిపాలన యంత్రాంగం బాధ్యతా యుతంగా వ్యవహరించాలని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

## చెక్ డ్యామ్ పేరుతో ఇసుక దోపిడీ

- అక్రమ తరలింపుపై సర్పంచ్ ధర్మతేజ ఆగ్రహం
- టిప్పర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు





**వేద న్యూస్, బీర్కూర్:**

బీర్కూర్ మండలం మంజీరా నదిపై నిర్మాణంలో ఉన్న చెక్ డ్యామ్ పనుల పేరుతో అక్రమంగా ఇసుక మిక్సింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారంటూ గ్రామ సర్పంచ్ ధర్మతేజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021లో భూగర్భ జలాల పెంపుదలకు రూ.30 కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగినప్పటికీ, ఐదేళ్లు గడిచినా పనులు పూర్తికాకపోవడం గమనార్హం. చెక్ డ్యామ్ కోసం ఏర్పాటు చేసిన మిక్సింగ్ ప్లాంట్ నుంచి మంజీరా నది ఇసుకను ఇతర నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు తరలిస్తున్నారని సర్పంచ్ ఆరోపించారు. సోమవారం పట్టపగలు మిక్సింగ్ చేసిన సామగ్రిని టిప్పర్‌లో తరలిస్తుండగా సర్పంచ్ ధర్మతేజ ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెక్ డ్యామ్ పనుల కోసం మాత్రమే మిక్సింగ్ ప్లాంట్ వినియోగించాలని కలెక్టర్ ఆదేశించినట్లు వెల్లడించారు. ఇసుక తరలింపుతో సంబంధిత సినర్జీ నిధులు గ్రామపంచాయతీకి జమ కాలేదని, మైనింగ్ శాఖ పర్యవేక్షణ లోపిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపై అక్రమంగా ఒక్క టిప్పర్ కూడా బయటకు వెళ్లనివ్వమని సర్పంచ్ హెచ్చరించారు. ఈ అంశంపై సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 164 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అందిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు 61, గృహనిర్మాణ శాఖకు 25, జిల్లా పంచాయతీ కార్యాలయం మరియు డీఆర్డీఓకు 13 చొప్పున, సంక్షేమ శాఖకు 9, ఉపాధి కల్పన శాఖకు 8, ఎండీ సెస్‌కు 5, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల మరియు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు 4 చొప్పున వచ్చాయి. ఎక్సైజ్ శాఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు 3 చొప్పున, పౌర సరఫరాలు, విద్యా, వైద్య శాఖలు మరియు ఆర్ అండ్ బీకి 2 చొప్పున దరఖాస్తులు అందాయి. జిల్లా వ్యవసాయ శాఖ, రవాణా శాఖ, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఈఓ, నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, ఎస్పీ కార్యాలయాలకు ఒక్కో దరఖాస్తు చొప్పున అందాయి. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలి

- పూర్తయ్యేంతవరకు తాత్కాలిక పంపింగ్ ఏర్పాటు చేయాలి
- బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్
- 21వ రోజుకు చేరుకున్న రైతుల రిలే నిరాహార దీక్ష



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో రంగనాయకసాగర్ 11/6 కాలువ అసంపూర్తి పనులను పూర్తి చేయాలని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 21వ రోజుకు చేరుకుంది. దీక్షకు భారతీయ జనతా పార్టీ ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు 11/6 కాలువ పనులను పూర్తి చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల పరిధిలోని 12 గ్రామాలకు చెందిన రైతులు 21 రోజులుగా దీక్ష కొనసాగిస్తున్నారని తెలిపారు. కాలువ పనులు పూర్తయితే సుమారు 10 వేల ఎకరాలు సాగులోకి వస్తాయని పేర్కొన్నారు. కాలువ నీరు వస్తుందనే నమ్మకంతో రైతులు పంటలు వేసుకున్నారని, ప్రస్తుతం నీటి ఎద్దడి ప్రారంభమైందని ఆందోళన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా 100 మీటర్ల పంపింగ్ వ్యవస్థను మోటార్ల సహాయంతో ఏర్పాటు చేస్తే అవతలి కాలువలోకి నీరు చేరి వరి సహా ఇతర పంటలు ఎండిపోకుండా కాపాడవచ్చని సూచించారు. 21 రోజులుగా దీక్ష జరుగుతున్నప్పటికీ అధికారులు స్పందించలేదని, వెంటనే నష్టనివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బత్తిని సాయి గౌడ్, దేశెట్టి శ్రీనివాస్, కొలనూరు ముత్తవ్వ, పినికాశి అనిల్, రైతులు కరికె నవీన్, అమ్ములు అశోక్, పయ్యావుల బాలయ్య, పలుమారు రవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు స్థలం కబ్జాపై కలెక్టర్ కు వినతి



**వేద న్యూస్, మడికొండ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట మండలం, 46వ డివిజన్ మడి కొండ, ఎస్సీ కాలనీ మహిళా కమ్యూనిటీ హాల్ ప్రక్కన ఉన్న రోడ్డు స్థలం కబ్జాకు గురి అయిందని ప్రజల కోసం గవ ర్నమెంట్ ఇచ్చిన రోడ్డును కొన్ని కుటుంబాలు కబ్జా చేయడంపై గతంలో పలు మార్లు జాంబవ సంఘం సభ్యులు, కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు వచ్చి పంచనామా చేసి నిర్ధారణ చేసి నోటీసులు ఇచ్చిన తర్వాత, ఆ అధికారులపై రాజకీయ పలుకుబడితో ఒత్తిడీ తీసుకువస్తూ, అభివృద్ధికి అడ్డుపడుతూ కాలనీ వాసులపై, కుల పెద్దలపై అసభ్య పదజాలంతో తిడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకొని దుర్భాషలాడుతూ బెదిరిస్తున్న విషయమై సోమవారం హనుమకొండ గ్రీవెన్స్ లో జాంబవ సంఘం అధ్యక్షులు వస్కుల ఆనందం ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించామని సంఘం సభ్యులు తెలిపారు. కలెక్టర్ చాహత్ బాజ్ పేయి సమస్యను తక్షణమే సమస్యను పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, వస్కుల శ్రీను, అరూరి రాజు, బొజ్జ శ్రీను, అరూరి తిరుపతి, రాసమల్ల రాజు, అరూరి ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

# హిందువులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**– కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిసిన జిల్లా అధ్యక్షులు**

**వేద న్యూస్, రుద్రూర్ :**



బిజెపి పార్టీ కేంద్రమంత్రి బండి సంజయ్ ను సోమవారం బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి కలిశారు. రుద్రూర్ మండల కేంద్రంలోని జేయన్సీ కాలనీలో న్యాయవాది కళ్యాణి పై, ఆనంద్ నగర్ గ్రామానికి చెందిన ఎస్సీ మహిళా వాగ్మరె నర్సాబాయ్ పై ఎంఐఎం పార్టీ ముష్కరులు చేసిన దాడిని బండి సంజయ్ కు వివరించారు. హిందు వులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బండి సంజయ్ ను కలిసిన వారిలో బిజెపి పార్టీ రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, జిల్లా కౌన్సిల్ నెంబర్ ప్రశాంత్ గౌడ్, భోజిగొండ అనిల్, వడ్ల సాయినాథ్, కుమ్మరి గణేష్ తదితరులు ఉన్నారు.

# లేటరల్ ఎంట్రీ విధానం తొలగిస్తే ఊరుకోము

**– పాలిటెక్నిక్ విద్యార్థులు**



**వేద న్యూస్, పరకాల :**

తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సభ్యుల బృందం ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించిన సిఫార్సుల నివేదిక పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉందని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జెఎసి రాష్ట్ర ఛైర్మన్ మేకల అక్షయ్ కుమార్ అన్నారు. విద్యా కమిషన్ ప్రస్తుత విద్యార్థులతోగానీ, పూర్వ విద్యార్థులతోగానీ, పాలిటెక్నిక్ ఉద్యోగ సంఘాలతోగానీ, పాలిటెక్నిక్ విద్యార్థి సంఘాలతోగానీ ఎలాంటి చర్చలు జరుపకుండా, అభిప్రాయ సేకరణ చేయకుండా ఏకపక్షంగా నాలుగుగోడల మధ్య కూర్చుని రూపొందించిన నివేదికలో పేర్కొన్న ప్రకారం పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ ఎంట్రెన్స్ ద్వారా బి.టెక్ లేటరల్ ఎంట్రీతో ద్వితీయ సంవత్సరం నుండి చదివే విధానాన్ని రద్దు చేసి ప్రథమ సంవత్సరం నుండి చదవాలని సిఫారసు చేయడం పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను పతనం చేస్తుందని అక్షయ్ కుమార్ తెలిపారు. ప్రపంచంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అధునాతన కోర్సులను ప్రవేశపెడుతూ నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను డిప్లొమాలో అందించడానికి విశేష కృషిచేస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్బీటీఈటీ) బోర్డును రద్దుచేయాలని సిఫారసుచేయడం హాస్యాస్పదమని అన్నారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను పతనంచేసే ఇలాంటి సిఫారసులుచేసిన విద్యా కమిషన్ రాష్ట్రంలో విద్యాశాఖను పర్యవేక్షించడానికి ప్రత్యేకమంత్రిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయకపోవడం శోచనీయమని అన్నారు. అనంతరం స్థానిక పరకాల ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి ప్లకార్డుల ప్రదర్శిస్తూ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు దొడ్డిపల్లి కుమార్, విద్యార్థి నాయకులు పల్లేరు స్వయంవీర, అనిల్, భవాని, భాను ప్రకాష్, అక్షయ, మోహియుద్దీన్, విశ్రుత్, సాన్వి తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించండి

**– కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన మడికొండ గ్రామస్తులు**



**వేద న్యూస్, మడికొండ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, మడికొండ, రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యపై సోమవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ లో నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పేయి కి అడ్ హక్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. ఈ సమస్యపై స్పందించిన కలెక్టర్, తాము ఈ డంపింగ్ యార్డ్ సమస్యను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి ఎంఆర్ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ) సాంకేతికతను వినియోగించి, ఆ వ్యర్థాలను బ్లాకులుగా మార్చి పరిశ్రమలకు తరలిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ చర్య ద్వారా డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారన్నారు. తదనంతరం అడ్ హక్ కమిటీ సభ్యులు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ను ఫోన్లో సంప్రదించామని, డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రతను వివరించగా, దానికి ఎమ్మెల్యే స్పందించి డంపింగ్ యార్డ్ సమస్య కొరకు తెలంగాణ వార్షిక బడ్జెట్లో నిధులను కేటాయించడం జరుగుతుందని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగట్టు స్వామి, పెళ్లి కృష్ణమూర్తి, తొట్ల రాజు పోనగోటి వెంకటరావు, కొలిపాక ప్రకాష్, స్వామి, కనక స్వామి, బిల్లా రవీందర్, తక్కలపల్లి నిఖిల్ రావు, దువ్వ విజయ్, పెద్ది సత్యనారాయణ, దువ్వ సాంబరాజు, చట్ల అజయ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

# రుద్రూర్ లో కామదహన వేడుకలు

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద కామదహన వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్ చేతుల మీదుగా కామ దహన వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీశ్రీశ్రీ బాలయోగి పిట్ల కృష్ణ మహారాజ్ (మల్లారం) పీఠాధిపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ప్రవచనాలు ప్రసంగించారు. భజనలు, కీర్తనలతో కామదహన వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ ప్లాటినం జూబ్లీ వేడుకలలో పాల్గొనండి

**వేద న్యూస్ , హనుమకొండ :**



వరంగల్ మహానగరంలో ప్రఖ్యాతిగాంచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పడి 70 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మార్చి 29న (ఆదివారం) ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు ఇ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజపాయిని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు. చారిత్రక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్:లో చదివి ప్రస్తుతం దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులందరూ ఈ మహోత్సవానికి హాజరవుతున్నారని తెలిపారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళాశాల నూతన భవన నిర్మాణం కొరకు రూ. 28 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కావున మార్చి 29న నిర్వహించనున్న ప్లాటినం జూబ్లీ వేడుకలలో భాగస్వాములు కావాలని స్థానిక శాసనసభ్యులు, కలెక్టర్ ని సంఘం నాయకులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నేతలు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్ రావు, యం. ప్రకాశ్, యం. భిక్షపతి, యం. శ్రీనివాసులు, యం. మల్లారెడ్డి, జి. సురేందర్, డి. సాయిరాజ్, ఏ. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ సంబరాలు

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్), రాణంపల్లి, చిక్కడ్ పల్లి, బొప్పాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో సోమవారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హోలీ వేడుకల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. అంబం (ఆర్) గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామ చావిడి వద్ద కామదహనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# గోవులకు ఎస్సై సాయన్న దాన పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలోని దేవి దాస్ రావు గోశాలలోని గోమాతలకు సోమవారం ఎస్సై పి.సాయన్న దాన పంపిణీ చేశారు. గోమాత అంటే దేవుని తో సమానమని, గోమాతను పూజిస్తే కోటి దేవుళ్లను పూజించే ఫలితం ఉంటుందని ఎస్సై సాయన్న తెలిపారు. రుద్రూర్ మండల కేంద్రంలో ఎస్సై సాయన్న చేస్తున్న సేవలు అభినందనీయమని, ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, గో సేవకులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా అదనపు ఎస్పీ 61వ జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, మెదక్ :**




మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ,సందేపోగు మహేందర్ గారి 61వ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ సేవా ప్రస్థానంలో నిజాయితీ, క్రమశిక్షణ, మానవీయ విలువలతో విధులు నిర్వహిస్తూ శాఖలో మంచి పేరు సంపాదించుకున్న అధికారిగా ఆయనను పలువురు అభినందించారు. జోగులాంబ గద్వాల్ జిల్లా ఉండవెల్లి మండలం ఇటిక్యాల పాడు గ్రామానికి చెందిన మహేందర్ 02-03-1965 న జన్మించారు. మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసి, ఉస్మానియా యూనివర్సిటీలో 19871989 మధ్య ఎంఏ హిస్టరీ పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని పలు సర్టిఫికెట్లు పొందారు. 1989 జనవరి 16న ఎస్సైగా పోలీస్ శాఖలో అడుగుపెట్టి, అనంతపూర్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ పూర్తి చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా విధులు నిర్వహించారు. 2005 ఆగస్టు 4న సీఐగా ప్రమోషన్ పొంది కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సమర్థవంతంగా పనిచేశారు. 2014 జూలై 21న డీఎస్పీ/ఏసిపిగా పదోన్నతి పొంది, మామునూర్ ఏసిపిగా, సీఐడి కరీంనగర్ డీఎస్పీగా, హుస్నాబాద్ ఏసిపిగా దీర్ఘకాలంగా సేవలందించారు. హుస్నాబాద్ డివిజన్లో ప్రజల మన్ననలు పొందిన అధికారిగా గుర్తింపు పొందారు. 2021 ఏప్రిల్ 21న అదనపు ఎస్పీ/అడిషనల్ డీసీపీగా ప్రమోషన్ పొంది, సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్లో అడిషనల్ డీసీపీ అడ్మిన్గా విజయవంతంగా విధులు నిర్వహించారు. 2023 ఆగస్టు 2న మెదక్ జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. సుదీర్ఘ సేవలో భాగంగా 2010లో సేవా పథకం, 2018లో ఉత్తమ సేవా అవార్డు, 2025 జూన్ 1న మహోన్నత సేవ పథకం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వరించాయి. అంతేకాకుండా తన సేవా కాలంలో సుమారు 100కి పైగా రివార్డులు, అవార్డులు అందుకున్నారు. విధి నిర్వహణలో సౌమ్యత, నీతి నిజాయితీలు, మానవీయ దృక్పథంతో పనిచేస్తూ డిపార్ట్మెంట్లో నలు గురికి ఆదర్శంగా నిలుస్తున్న మహేందర్ సేవలు ప్రశంసనీయమని అధికారులు పేర్కొన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం తనిఖీ

**వేద న్యూస్, నల్లబెల్లి :**



నల్లబెల్లి మండల కేంద్రంలోని కె.జి.బి.వి. కళాశాలను జిల్లా ప్యానెల్ ఇన్స్పెక్టర్ నోడల్ అధికారి గాయపు లింగారెడ్డి నేతృత్వంలో టీమ్-2 తనిఖీ బృందం సోమవారం సందర్శించింది. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను పరిశీలించారు. ఇంటర్, పదవతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల పట్ల శ్రద్ధ పెట్టి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ను అమలు చేయాలని సూచించారు. లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్, కంటిన్యూ కాంప్రహెన్సివ్ ప్రోగ్రామ్ అమలు తీరును రోజువారీ రిజిస్టర్లు, వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ బృందంలో కె.ఆనంద్ మోహన్ రావు, టి.శ్రీనివాస్ రావు, ఆర్.రామసంతోష్, డాక్టర్ ఎం.భాస్కర్, మంద రాజు, చక్రవర్తుల నాగార్జున్ రావు, చిట్టిబోతుల సంపత్ పాల్గొన్నారు. కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఎ.సునిత, పిజి సీఆర్టి, సీఆర్టి బృందం పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా స్పందన బాధ్యతల స్వీకరణ

**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి:**



మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టీ. మోహన్ పదవీ విరమణ పొందడంతో, జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం స్పందనకు మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు హెచ్‌ఎం స్పందన సోమవారం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, పౌరసేవలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కట్టుబడి పనిచేస్తానని ఆమె తెలిపారు.

## కలెక్టర్ ని కలిసిన రెడ్ క్రాస్ పాలకమండలి

**వేద న్యూస్, హనుమకొండ :**

హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజపాయిని సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలకమండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ మరియు సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణపై సభ్యులు కలెక్టర్ కి వివరించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీని సందర్శించవలసిందిగా ఆహ్వానించారు. పాలకవర్గ సభ్యులు కలెక్టర్ ని శాలువాతో సత్కరించి, పూలమొక్క, మెమెంటో మరియు రెడ్ క్రాస్ ఏజీఎం పుస్తకాన్ని అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ రెడ్ క్రాస్ కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ కార్యకలాపాలు ఆదర్శంగా నిలిచి, జిల్లా మొదటి వరుసలో నిలిచేలా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి,



రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు డాక్టర్ మాగంటి శేషుమాదవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డా. సి.ఎచ్. సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## పొన్నం ప్రభాకర్ కు గుణపాఠం చెప్పాలి

- వెలుగుమట్ల భూబాధితులకు అండగా నిలుస్తాం
- ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సంతోష్ నాయక్

**వేద న్యూస్, అక్కన్నపేట:**



వెలుగుమట్ల భూబాధితులకు అండగా ఉంటామని, గ్రామీణ పేదల సంఘం, ఓపీడీఆర్‌యూ, సీసీఆర్‌ఐఎంఎల్ నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సంతోష్ నాయక్ డిమాండ్ చేశారు. అక్కన్నపేట మండల ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో సుమారు 900 పైగా నిరుపేద కుటుంబాలు గత 12 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాయని తెలిపారు. చిన్నపాటి పనులు, వ్యాపారాలతో జీవనం సాగిస్తున్న ఈ కుటుంబాలను ఖాళీ చేయించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్కలకు అనుకూలంగా మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విలువైన భూములపై కన్నేసిన రియల్ ఎస్టేట్ మాఫియా, భూకబ్జాదారులు రాజకీయ నాయకులతో కుమ్మక్కై పేదలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. గతంలో గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితుల విషయంలో జరిగిన అన్యాయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పుడు వెలుగుమట్లలో కూడా అదే పరిస్థితి నెలకొంటోందని తెలిపారు. అక్కన్నపేట మండలంలోని కట్కూరు, కేశవాపూర్ గ్రామ ప్రజలు కూడా ఐక్యంగా పోరాటం చేయాలని, వెలుగుమట్ల ప్రజలకు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే గ్రామ గ్రామాన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

## అట్టహాసంగా ప్రారంభమైన క్రీడలు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

- జాతర క్రీడలను ప్రారంభించిన డిఎస్పి రాజశేఖర్ రాజు

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామంలో కాకతీయుల కాలం నుండి ప్రసిద్ధి శ్రీ రామలింగేశ్వర జాతర రాష్ట్రస్థాయి కబడ్డీ, కోలాటం క్రీడలను దేవాలయ చైర్మన్ బ్రహ్మదేవర విద్యాసాగర్ తో కలిసి మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు ప్రారంభించారు.అలాగే సోమవారం ఎడ్ల పందాలను ఎస్సై వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలను ప్రారంభించారు. అంతకుముందు శ్రీరామలింగేశ్వర దేవాలయంలో అర్చకులు రెంటాల సతీష్ శర్మ,మణిశర్మ ఆధ్వర్యంలో అర్చనలు,అభిషేకాలు దేవాలయ చైర్మన్ తో కలిసి డీఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కబడ్డీ క్రీడలలో పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించారు.ఈ సందర్భంగా డిఎస్పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడలలో పాల్గొనే క్రీడాకారులు ఫ్రెండ్లీ క్రీడలు నిర్వహించుకోవాలని కోరారు.జాతర భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు బాగున్నాయన్నారు. దేవాలయం కోరుకుంటే వరాలిచ్చే దేవాలయంగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు పిల్లల సందీప్,ఎలికంటి భరత్, ఉపసర్పంచ్లు సాలెం రాజు, గంట స్వాతి నరసయ్య,పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ, రాష్ట్ర ఐ ఎన్ టి యు సి కార్యదర్శి బంటు చుక్కయ్య



గౌడ్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి, కాంగ్రెస్ మండల నాయకులు రావు ఎల్లారెడ్డి,రవీందర్ రెడ్డి,ధర్మకర్తలు బచ్చు జానయ్య, కత్తుల లింగయ్య,కోలా అశోక్, ముత్యాల వెంకటయ్య, పళ్ళ శేఖర్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## నాలుగేళ్లయినా సాగుతూనే...

- పూర్తికాని సెంట్రల్ లైటింగ్, తారు రోడ్డు పనులు
- దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, రోడ్డు వెడల్పు, తారు రోడ్డు పనులు నాలుగేళ్లుగా పూర్తికాక మధ్యలోనే ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు నిలిచిపోవడంతో రహదారి అంతా దుమ్ము, ధూళితో నిండిపోగా ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం చొప్పదండి మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుండగా, కరీంనగర్ మంచిర్యాల ప్రధాన రహదారిపై రోజూ వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయి. దీంతో రోడ్డుపై దుమ్ము తీవ్రంగా ఎగసిపడుతోంది. రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు, హోటల్, బేకరీ యజమానులు దుమ్ముతో వ్యాపారం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితి కొనసాగితే మరిన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, వెంటనే సెంట్రల్ లైటింగ్ మరియు తారు రోడ్డు పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు, వ్యాపారవేత్తలు కోరుతున్నారు. నాయకులు, అధికారులు స్పందించి రహదారికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## పీఎం మోదీ ప్రేరణతో క్రీడా మహోత్సవం

- వాలీబాల్ టోర్నమెంట్‌లో చందుర్తి యువత విజయం

**వేద న్యూస్, చందుర్తి:**



వేములవాడ నియోజకవర్గంలోని శత్రాజుపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రధాన మంత్రి సంసద్ క్రీడా మహోత్సవంలో చందుర్తి మండల కేంద్రానికి చెందిన యువ త వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలు గా నిలిచారు. ఈ టోర్నమెంట్‌లో రజినీకాంత్, శ్రీహరి, ఆసిఫ్, గౌతమ్, గంగాధర్, హర్ష ప్రదర్శించిన ప్రతిభకు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చందుర్తి మాజీ ఉపసర్పంచ్ చిర్రం తిరుపతి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, దేశభక్తితో క్రమశిక్షణతో జీవిస్తూ క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సిరికొండ తిరుపతి, మంద రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్



**వేద న్యూస్ మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా కుతుబుల్లాపూర్ తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గణేష్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ కోసం తహసీల్ కార్యాలయాన్ని సంప్రదించిన బాధితుడికి జూనియర్ అసిస్టెంట్ రూ. 20 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో మొదటి విడతగా రూ. 5 వేలు తీసుకోగా చివరి విడతగా సోమవార రూ. 15 వేలు లంచం తీసుకుంటూ సిటీ రేంజ్ వన్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.

## భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

- మౌలిక వసతులతో వినియోగంలోకి తీసుకురావాలి
- మహిళా సమాఖ్య భవనాల పనులు తక్షణమే ప్రారంభించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంగన్వాడీ, గ్రామ పంచాయతీ, హెల్త్ సబ్‌సెంటర్ల తుదిదశ భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎన్‌హెచ్‌ఎం, డీఎంఎఫ్‌టీలతో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవనాలు, అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, ప్రహరీలు, కస్తూర్బాగాంధీ విద్యాలయాల నిర్మాణాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మంజూరైన మహిళా సమాఖ్య భవనాల పనులను మూడు రోజుల్లో ప్రారంభించి, ఇప్పటికే చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తుదిదశలో ఉన్న భవనాలకు నీటి, విద్యుత్, టాయిలెట్ సౌకర్యాలు కల్పించి వినియోగానికి సిద్ధం చేయాలని సూచించారు. ప్రారంభం కాని పనులపై ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించాలని, ఏఈలు, ఏపీవోలతో సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి పనులను గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. అంగన్వాడీలలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ డస్ట్‌బిన్‌లు, హ్యాండ్‌వాష్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ప్రతి అభివృద్ధి పనిని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, పురోగతిని నిరంతరం సమీక్షించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్డీఓ గీత, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్ రెడ్డి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, ఎంపీడీవోలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా హోలీ సంబరాలు జరుపుకోవాలి


- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- త్రిబుల్ రైడింగ్, స్టంట్లు చేస్తే వాహనాల సీజ్
- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



**వేద న్యూస్, కరీంనగర్:**

రంగుల పండుగ హోలీ సందర్భంగా కరీంనగర్ జిల్లా ప్రజలకు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ హోలీ పండుగను ప్రశాంతమైన, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా కమిషనరేట్ పరిధిలో పలు సూచనలు జారీ చేశారు. చర్మం, కళ్లకు హాని చేసే రసాయన రంగుల బదులు సహజ రంగులు వినియోగించాలని, ఇతరుల అంగీకారంతోనే రంగులు చల్లాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. మోటార్ సైకిళ్లపై త్రిబుల్ రైడింగ్, అతివేగం, స్టంట్లు చేసే వారిపై వాహనాల సీజ్‌తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోలీ సాకుతో ఈవ్‌టీజింగ్, మహిళల వేధింపులపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక షీ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా డీజే సౌండ్ వినియోగించడం, మతపరమైన పోస్టులు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం నిషేధమన్నారు. హోలీ కార్యక్రమాలు నిర్వహించేవారు ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి పొందాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం 100కు డయల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. నగర ప్రజలంతా పోలీసులకు సహకరించి సురక్షిత వాతావరణంలో హోలీ పండుగ జరుపుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## కారు బీభత్సం.. డీసీఎంను ఢీకొట్టిన క్షణాల్లోనే దగ్ధం!



వేద న్యూస్ హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో కారు బీభత్సం సృష్టించింది. బైరమల్‌గూడ ఫ్లైఓవర్‌పై అతివేగంతో దూసుకొచ్చిన కారు.. డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టింది. అనంతరం డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారంఅందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో కారు పూర్తిగా దగ్ధమైంది. కాగా, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే కారులో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో కారులో ఉన్నవారంతా మద్యం మత్తులో ఉన్నారని పోలీసులు తెలిపారు.

# కనీస వేతనం అమలు చేయాలి




- మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి
- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజమల్లు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

**వేద న్యూస్, కరీంనగర్:**

రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే కార్మికులకు పనికి తగ్గ వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు డీఏ అమలు చేయాలని, ఐడీ కార్డులు ఇవ్వాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.30 వేల అంత్య క్రియల సాయం అందించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించి, కార్మికుల పేర్లు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు పూర్తైన లేదా విధుల్లోనే మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని, రిటైర్మెంట్ రోజునే పీఎఫ్, ఇతర బెనిఫిట్లు చెల్లించాలని కోరారు. కార్పొరేషన్‌లో తొలగించిన 55 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ ముక్కెర బుజ్జమ్మ, జిల్లా అధ్యక్షుడు కవంపల్లి రవి, కార్పొరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జి పనుల్లో భద్రతా లోపాలు

- గిర్డర్ల అమరికలో నిర్లక్ష్యం ఆరోపణలు
- వాహన రాకపోకల నియంత్రణ లేక ప్రజల ఆగ్రహం
- ప్రమాదానికి దారితీసే పరిస్థితులపై ఆందోళన

**వేద న్యూస్ హైదరాబాద్ :**

సంతోష్‌నగర్‌చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ ఐరన్ గిర్డర్లను క్రేన్ల సాయంతో అమర్చుతున్న సమయంలో కిందుగా వాహనాల రాకపోకలు కొనసాగడం ప్రమాదానికి దారితీసే పరిస్థితులను సృష్టిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ ప్రాంతంలో తగిన హెచ్చరిక బోర్డులు, భద్రతా తాడులు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు కనిపించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భారీ గిర్డర్లు ఎత్తి అమర్చే సమయంలో కింద వాహనాలు వెళ్లడం వల్ల ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశముందని చెబుతున్నారు. ప్రజల ప్రాణాలతోచెలగాటం ఆడుతు న్నట్లుగా వ్యవహరి స్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేసి లేదా మళ్లించి



పనులు చేపట్టాల్సిందని వారు సూచిస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పనులు పూర్తయ్యే వరకు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

# నేహా శెట్టికి అవకాశాల కోసం ఎదురుచూపులు


**వేద న్యూస్ డెస్క్:**



అందం, అభినయం, ఉత్సాహంఈ మూడు లక్షణాలు కలిసివస్తేనే ఓ నటి పరిశ్రమలో నిలదొక్కుకో గలదు. ఆ లక్షణాలన్నీ ఉన్నప్పటికీ సరైన అవకాశాలు దొరకకపోతే కెరీర్‌లో ఒడిదుడు కులు తప్పవు. ప్రస్తుతం అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది అందాల నటి నేహా శెట్టి. ఒకే ఒక్క చిత్రంతో విపరీతమైన గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు మళ్లీ బలమైన పాత్ర కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. దర్శకుడు పూరి జగన్నాథ్ తనయుడు ఆకాశ్ పూరి హీరోగా తెరకెక్కిన మెహబూబా చిత్రంతో నేహా శెట్టి తెలుగు తెరకు పరిచయమైంది. తొలి చిత్రమే కావడంతో ఆమెపై పెద్దగా అంచనాలు లేకపోయినా, తెరపై ఆమె అందం, తెగువ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో నేహా శెట్టికి మొదటి అడుగు పెద్ద బ్రేక్ ఇవ్వలేకపోయింది. అయినప్పటికీ పరిశ్రమలో ఆమెకు అవకాశాలు తగ్గలేదు. ఆమె కెరీర్‌ను ఒక్కసారిగా మలుపుతిప్పిన చిత్రం డీజే టిల్లు. ఇందులో సిద్ధు జొన్నలగడ్డ సరసన నటించిన నేహా 'రాధిక' పాత్రతో యువతలో సంచలనమే సృష్టించింది. ఆ పాత్రలో ఆమె చూపించిన శైలీ, సంభాషణల తీరు, ఆత్మవిశ్వాసం ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా యువతలో ఆమెకు ప్రత్యేకమైన అభిమాన వర్గం ఏర్పడింది. సామాజిక మాధ్యమాల్లో 'రాధిక' పాత్రకు సంబంధించిన సంభాషణలు, దృశ్యాలు విస్తృతంగా చర్చకు దారి తీశాయి. ఒక్కసారిగా నేహా శెట్టి పేరు టాలీవుడ్‌లో ప్రముఖంగా వినిపించింది. అయితే ఆ విజయానంతరం వచ్చిన చిత్రాలు మాత్రం ఆమెకు అంతటి గుర్తింపు తీసుకురాలేకపోయాయి. కొన్ని చిత్రాల్లో నటించినప్పటికీ అవి బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపకపోవడంతో ఆమె కెరీర్ మళ్లీ నెమ్మదించింది. విజయాలు వరుసగా రాకపోతే పరిశ్రమలో అవకాశాలు తగ్గడం సహజమే. అదే పరిస్థితి ఇప్పుడు నేహా శెట్టిని ఎదుర్కొంటోంది అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇటీవల పవన్ కళ్యాణ్ నటిస్తున్న ఓజీ చిత్రంలో ప్రత్యేక గీతంలో కనిపించే అవకాశం ఆమెకు దక్కింది. ఈ గీతం ద్వారా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావాలనే ఆశలు ఆమె అభిమానుల్లో కనిపించాయి. అయితే చిత్రం నిడివి ఎక్కువగా ఉండటంతో ఆ భాగాన్ని తొలగించినట్లు వార్తలు వచ్చాయి. అనంతరం ఆ గీతాన్ని వేరుగా విడుదల చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమెకు మరోసారి నిరాశే మిగిలిందనే భావనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం నేహా శెట్టి మంచి కథలు, బలమైన పాత్రల కోసం వేచి చూస్తోంది. పరిశ్రమలో పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎంతో కీలకం. మరోవైపు ఆమె సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తన తాజా చిత్రాలను అభిమానులతో పంచుకుంటోంది. గ్లామర్ ఫోటోషూట్లతో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తూ మళ్లీ అవకాశాలు దక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, నేహా శెట్టికి సరైన కథా ఎంపిక అత్యంత కీలకం. 'రాధిక' తరహాలో మరో బలమైన పాత్ర లభిస్తే ఆమె మళ్లీ విజయపథంలోకి రావడం ఖాయం అంటున్నారు. అందం మాత్రమే కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు ఎంచుకుంటే ఆమె కెరీర్ మరింత బలపడే అవకాశం ఉంది. అభిమానులు కూడా ఆమె నుంచి మరో గుర్తుండిపోయే పాత్రను ఆశిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఒకే ఒక్క విజయంతో వచ్చిన క్రేజ్‌ను నిలబెట్టుకోవడం ఎంత కష్టమో నేహా శెట్టి ఉదాహరణగా నిలుస్తోంది. అయితే పట్టుదలతో ముందుకు సాగితే అవకాశాలు మళ్లీ తలుపుతడతాయనే నమ్మకం ఆమె అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

# 'పెద్ది' నుంచి రెండో సింగిల్ 'రాయ్ రాయ్ రా రా' విడుదల..

**వేద న్యూస్ డెస్క్:**




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'పెద్ది' చిత్రంలోని రెండో గీతం 'రాయ్ రాయ్ రా రా' విడుదలపై స్పష్టత వచ్చింది. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'చికిరి చికిరి'కి మంచి ఆదరణ లభించడంతో రెండో గీతంపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈసారి ముందస్తు ప్రచార చిత్రిక విడుదల చేయక పోవడంతో పాట విడుదల సమయంపై కొంత గందరగోళం నెలకొన్నా, తాజా ప్రకటనతో సందేహాలు నివృత్తి అయ్యాయి. ఈ రోజు సాయంత్రం 7 గంటల 2 నిమిషాలకు గీతాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది.విడుదల సమయాన్ని ధృవీకరిస్తూ రామ్ చరణ్‌కు సంబంధించిన కొత్త రూపచిత్రాన్ని కూడా విడుదల చేశారు. అందులో ఆయన మాస్ శైలిలో కనిపిస్తూ అభిమానుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో సాగే ఈ చిత్రంలో రామ్ చరణ్ భిన్నమైన పాత్రలో కనిపించనున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. రెండో గీతం ఉత్సాహభరితమైన సమాచారం వినిపిస్తోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నృత్య కదలికలు ఈ గీతానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చెబుతున్నారు ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. రామ్ చరణ్‌జాన్వీ జంటపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. వీరిద్దరి మధ్య సన్నివేశాలు, భావోద్వేగ దృశ్యాలు చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ భారత స్థాయిలో తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్ట్‌ను 2026 ఏప్రిల్ 30న విడుదల చేయాలని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. మొత్తంగా 'పెద్ది' నుంచి వస్తున్న ప్రతి సమాచారం అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. రామ్ చరణ్ గత చిత్రం గేమ్ చేంజర్ ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించకపోవడంతో ఈ చిత్రం మాత్రం ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక కొన్ని గంటల్లో విడుదల కానున్న 'రాయ్ రాయ్ రా రా' గీతం ఆయన సినీ ప్రయాణంలో మరో భారీ విజయంగా నిలుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# 'విశ్వనాథ్ అండ్ సన్స్'గా సూర్య 46వ చిత్రం

**వేద న్యూస్ డెస్క్:**





కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా, యువ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రానికి 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే శీర్షికను ఖరారు చేశారు. సూర్య నట జీవితంలో 46వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన తొలి దర్శనాన్ని చిత్ర బృందం అధికారికంగా విడుదల చేయడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. విడుదలైన పోస్టర్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి ఓ చిన్నారిని ఎత్తుకుని కనిపించగా, సరళమైన. ప్రముఖ నటి రాధికా శరత్ కుమార్, బాలీవుడ్ నటి రవీనా టాండన్, భవాని శ్రీ, బిజోర్న్ సర్‌రావు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కుటుంబ నేపథ్యంతో పాటు భావోద్వేగాలు, వాణిజ్య అంశాలను సమతుల్యంగా మేళవించిన కథగా ఈ చిత్రం రూపొందుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. సంగీతాన్ని జీవీ ప్రకాశ్ కుమార్ అందిస్తుండగా, గీతాలు మరియు నేపథ్య సంగీతంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. నిర్మాణ విలువలు అత్యున్నత స్థాయిలో ఉండనున్నాయని తెలుస్తోంది. జూలై నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో చిత్రబృందం పనులు వేగవంతం చేసింది. సూర్య వెంకీ అట్లూరి కలయిక కావడంతో తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి దర్శనంతోనే ఆసక్తిని రేకెత్తించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' రాబోయే రోజుల్లో మరిన్ని విశేషాలతో అభిమానులను అలరించనుంది.

# ఉస్తాద్ భగత్ సింగ్‌లో పవన్ కల్యాణ్ నయా రూపం

**వేద న్యూస్ డెస్క్:**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'దేఖ్ లేంగే సాలా', 'ఉస్తాద్ ఆభా' గీతాలు అభిమానుల్లో మంచి స్పందన తెచ్చుకుని చిత్రంపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త రూపంలో పవన్ కల్యాణ్ కుర్చీలో ప్రశాంతంగా కూర్చొని, స్టైలిష్‌గా కనిపిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. ఈ రూపంలో ఆయనలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం, సౌమ్యత, అదే సమయంలో దాగి ఉన్న దూకుడు పాత్రపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'ఛిల్' మూడ్‌లో కనిపించినా, పాత్రలోని తీవ్రత, యాక్షన్ శక్తి తెరపై విపరీతంగా ఉండబోతుందనే సంకేతాలు ఈ చిత్రంతో ఇస్తున్నారని అభిమానులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా, రాశి ఖన్నా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రత్యేక చూపులో పవన్ కల్యాణ్ పలికిన సంభాషణలు సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారి తీశాయి. పోలీస్ నేపథ్యంతో సాగే ఈ కథలో శక్తివంతమైన సంభాషణలు, మాస్ అంశాలు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని సమాచారం. ఇదే దర్శకుడునటుడు కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ భారీ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ విజయానంతరం మళ్లీ జోష్‌తోఈ చిత్రం రూపొందుతుండటంతో అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. వినోదం, యాక్షన్, భావోద్వేగం సమతుల్యంగా మేళవించిన కథతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం చిత్రబృందంలో వ్యక్తమవుతోంది. చిత్రీకరణ దాదాపు పూర్తయిన ఈ




సినిమాను మార్చి 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు. ప్రచార కార్యక్రమాలను దశలవారీగా నిర్వహిస్తూ చిత్రంపై ఆసక్తిని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. తాజా రూపంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై ఉన్న ఆసక్తి మరింత పెరిగిందని చెప్పాలి. విడుదలైన తర్వాత ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.

వేద న్యూస్

మంగళవారం మార్చి 03, 2026

# అదే 97 పరుగులు.. గంభీర్ ఇన్నింగ్స్‌ను గుర్తు చేసిన సంజు

**వేద న్యూస్ డెస్క్:**



టీ20 ప్రపంచకప్ 2026 తుది దశకు చేరుకుంటున్న వేళ దేశవ్యాప్తంగా సంజు పేరు మార్మోగుతోంది. విండీస్‌పై అతడు ఆడిన అద్భుత ఇన్నింగ్స్ అభిమానులను ఉర్రూతలూగించింది. 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో చేసిన 97 పరుగులు జట్టును విజయపథంలో నడిపించాయి. ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న సంజు శాంసన్ కీలక సమయంలో తన ప్రతిభను నిరూపించుకుని జట్టుకు ఎంత అవసరమో చాటి చెప్పాడు. దాదాపు పదకొండేళ్ల కెరీర్‌లో అవకాశాలు వచ్చినా రాకపోయినా ఆత్మవిశ్వాసం కోల్పోని సంజు, చావో రేవో మ్యాచ్‌లో తానేంటో చూపించాడు. అతడు చేసిన 97 పరుగులు ఇప్పుడు అభిమానులకు మరో చారిత్రాత్మక ఇన్నింగ్స్‌ను గుర్తు చేస్తున్నాయి. అది 2011 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో గౌతమ్ గంభీర్ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్. శ్రీలంకపై జరిగిన ఆ తుది పోరులో గంభీర్ క్రీజులో నిలబడి జట్టును గెలుపు దిశగా నడిపించాడు. సెంచరీకి మూడు పరుగుల దూరంలో అవుట్ అయినప్పటికీ అతడి పోరాటం లేకపోతే భారత్ విజయం సాధించేదా అన్న ప్రశ్న ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. ఆ మ్యాచ్‌లో చివరికి ఎంఎస్ ధోనీ కొట్టిన ఆ సిక్స్ భారత క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయం అయింది. దాదాపు 28 ఏళ్ల తర్వాత భారత్‌కు రెండో వన్డే ప్రపంచకప్ అందించిన ఆ షాట్ ఎప్పటికీ అభిమానుల హృదయాల్లో నిలిచిపోతుంది. అయితే గంభీర్ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్‌కు తగిన గుర్తింపు రాలేదనే అభిప్రాయం చాలామందిలో ఉంది. పెరీరా బౌలింగ్‌లో అవుట్ అయిన గంభీర్ సెంచరీ కోల్పోయినా, జట్టును నిలబెట్టిన స్థిరమైన ఆటతీరుతో విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు సంజు కూడా అదే సంఖ్యను తాకడం విశేషంగా మారింది. సెంచరీ కాకపోయినా ఆ 97 పరుగులే మ్యాచ్‌ను మలుపుతిప్పాయి. తుది దశకు చేరుకున్న ఈ టోర్నీ లో సంజు ఇన్నింగ్స్ జట్టుకు అపారమైన ఆత్మవిశ్వాసం ఇచ్చింది. అభిమానులు

ఇద్దరి ఇన్నింగ్స్‌లను పోలుస్తూ సామాజిక మాధ్యమాల్లో చర్చలు జరుపుతున్నారు. సెంచరీలు మాత్రమే కాదు, కీలక సమయంలో చేసిన పరుగులే అసలు విలువైనవని ఈ రెండు ఇన్నింగ్స్‌లు మరోసారి చాటిచెప్పాయి. 2011లో గంభీర్ 97 లేకపోతే ప్రపంచకప్ కల సాకారం అయ్యేదా? నేడు సంజు 97 లేకపోతే జట్టు మరో దశకు చేరుకునేదా? అన్న ప్రశ్నలు ఇప్పుడు అభిమానుల మనసుల్లో మార్మోగుతున్నాయి. క్రికెట్‌లో సంఖ్యలు కేవలం గణాంకాలే అయినప్పటికీ, కొన్ని సంఖ్యలు మాత్రం చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటాయని ఈ 97 పరుగులు మళ్లీ నిరూపించాయి.



## పాక్ ఆటగాళ్లపై భారీ జరిమానా



**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్‌లో నిరాశాజనక ప్రదర్శన చేసిన పాకిస్థాన్ జట్టుపై ఆ దేశ క్రికెట్ బోర్డు కఠిన నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లపై భారీ జరిమానా విధించినట్లు ప్రకటించింది. సూపర్ 8 దశలోనే జట్టు నిష్క్రమించడంతో అభిమానుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో బాధ్యులైన ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బోర్డు భావించినట్లు తెలుస్తోంది. బోర్డు నిర్ణయం ప్రకారం కీలక ఆటగాళ్లపై ఒక్కొక్కరికి సుమారు 50 లక్షల పాకిస్థాన్ రూపాయల జరిమానా విధించారు. ఇది భారత కరెన్సీలో సుమారు 17 లక్షల రూపాయలకు సమానం. జట్టులో ప్రధాన బాధ్యతలు నిర్వర్తించాల్సిన సీనియర్ ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంపై బోర్డు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్, వేగ బౌలర్ షహీన్ అఫ్రిది, ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ వంటి ప్రముఖులపైనా ఈ జరిమానా వర్తింపజేసినట్లు సమాచారం. కీలక మ్యాచ్‌ల్లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు రెండింట్లోనూ జట్టు విఫలమవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. భారత్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో సరైన ప్రదర్శన చేయకపోవడం, ఒత్తిడిని తట్టుకోలేకపోవడం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో మెరుగైన ఆటతీరును కనబరచిన వారికి మాత్రమే ప్రోత్సాహకాలు ఉంటాయని బోర్డు స్పష్టం చేసింది. క్రమశిక్షణ లోపిస్తే మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నిర్ణయం పాకిస్థాన్ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాబోయే సిరీస్‌ల్లో జట్టు ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అభిమానుల విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకోవడం జట్టుకు పెద్ద సవాలుగా మారింది.

## అఫ్గానిస్తాన్ భారత్ పర్యటన షెడ్యూల్ విడుదల

**వేద న్యూస్ డెస్క్:**




అఫ్గానిస్తాన్ క్రికెట్ జట్టు జూన్ 2026లో భారత్ పర్యటనకు రానుంది. ఈ విషయాన్ని బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా అధికారికంగా ప్రకటించింది. ఇరు జట్ల మధ్య ఒక టెస్ట్ మ్యాచ్, మూడు వన్డే మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ సిరీస్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. ఏకైక టెస్ట్ మ్యాచ్ జూన్ 6 నుంచి 10 వరకు న్యూ చండీగఢ్‌లోని మహారాజా యదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంవేదికగా జరగనుంది. ఈ మైదానంలో జరుగనున్న తొలి అంతర్జాతీయ టెస్ట్ ఇదే కావడం విశేషం. కొత్త వేదికపై ఇరు జట్లు పోటీపడనున్నందున క్రికెట్ అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. పిచ్ స్వభావం ఎలా ఉంటుందో, స్పిన్‌కు అనుకూలమా లేక పేస్‌కు మద్దతిస్తుందా అన్న చర్చలు ఇప్పటికే మొదలయ్యాయి. టెస్ట్ మ్యాచ్ అనంతరం వన్డే సిరీస్ జరగనుంది. తొలి వన్డే జూన్ 14న ధర్మశాలలో నిర్వహించనున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ఎత్తైన వాతావరణంలో జరిగే ఈ మ్యాచ్ బ్యాటర్లకు సవాల్‌గా మారే అవకాశం ఉంది. రెండో వన్డే జూన్ 17న లఖ్‌నవూలో జరగనుంది. మూడో వన్డే జూన్ 20న చెన్నైలో నిర్వహించనున్నారు. చెన్నై పిచ్ సాధారణంగా స్పిన్‌కు అనుకూలంగా ఉండటం వల్ల ఇరు జట్ల స్పిన్నర్లకు ఇది కీలకంగా మారవచ్చు. భారత్, అఫ్గానిస్తాన్ జట్లు ఇప్పటివరకు కేవలం ఒక టెస్ట్ మ్యాచ్‌లో మాత్రమే తలపడ్డాయి. అది 2018లో జరిగింది. ఆ తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇరు జట్లు ముఖాముఖి కాలేదు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ టెస్ట్ క్రికెట్‌లో పోటీ పడనుండటం విశేషం. ఈ సిరీస్ ఇరు జట్లకు కూడా ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. అఫ్గానిస్తాన్ జట్టు ఇటీవలి కాలంలో అంతర్జాతీయ వేదికపై మంచి ప్రదర్శనలు చేస్తోంది. యువ ఆటగాళ్లతో పాటు అనుభవజ్ఞుల సమ్మేళనంగా ఉన్న ఈ జట్టు భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు స్వదేశంలో ఆడే అవకాశం భారత్‌కు బలంగా మారనుంది. అభిమానుల అంచనాలు, వేదికల ప్రత్యేకత, జట్ల పోటీ భావం కలిసి ఈ సిరీస్‌ను మరింత ఆసక్తికరంగా మార్చనున్నాయి. మొత్తంగా జూన్ నెలలో జరగనున్న ఈ పర్యటన క్రికెట్ ప్రేమికులకు పండుగ వాతావరణాన్ని తీసుకురానుంది. టెస్ట్‌తో మొదలై వన్డేలతో ముగిసే ఈ సిరీస్ ఇరు జట్ల భవిష్యత్ ప్రణాళికలకు కూడా కీలకంగా మారనుంది.

## పాక్ ఫైనలే నాకు ఫేవరెట్ రోహిత్

**వేద న్యూస్ డెస్క్:**



భారత్‌పాకిస్థాన్ పోరాటాల గురించి మాట్లాడితే తనకు ముందుగా గుర్తుకు వచ్చేది 2007 టీ20 ప్రపంచకప్ ఫైనలేనని భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ పేర్కొన్నాడు. పాకిస్థాన్‌తో ఆడిన ఎన్నో మ్యాచ్‌లలో ఆ ఫైనల్‌ను ఏదీ అధిగమించలేదని స్పష్టం చేశాడు. 2026 టీ20 ప్రపంచకప్‌కు రాయ బారిగా వ్యవహరిస్తున్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశాడు. 2007లో జరిగిన తొలి టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్, పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్ గెలుచుకుంది. ఆ విజయానుభూతి తనకు ఇప్పటికీ ప్రత్యేకమని రోహిత్ వెల్లడించాడు. అదే టోర్నీలో లీగ్ దశలో జరిగిన మ్యాచ్ బౌల్ అవుట్‌తో ముగిసిందని, ఆ పోరాటం కూడా ఎంతో ఉత్కంఠభరితంగా సాగిందని గుర్తుచేశాడు. ఆ రెండు మ్యాచ్‌లు తన కెరీర్‌లో మధుర జ్ఞాపకాలుగా నిలిచాయని పేర్కొన్నాడు. 2007 నుంచి 2024 వరకు జరిగిన అన్ని టీ20 ప్రపంచకప్ టోర్నీల్లో పాకిస్థాన్‌తో జరిగిన ప్రతి మ్యాచ్‌లో తాను ఆడటం తనకు గర్వకారణమని రోహిత్ అన్నాడు. భారత్‌పాక్ పోరు అంటే ఎప్పుడూ ప్రత్యేకమేనని, ఆ ఒత్తిడి వాతావరణంలో ఆడటం ప్రతి ఆటగాడికీ సవాలుగా మారుతుందని తెలిపాడు. అలాగే 2022 టీ20 ప్రపంచకప్‌లో మెల్బోర్న్ వేదికగా జరిగిన మ్యాచ్‌ను కూడా రోహిత్ ప్రస్తావించాడు. ఆ మ్యాచ్‌లో తాను త్వరగా అవుట్ అయ్యానని, తరువాత డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చుని తీవ్ర ఉద్వే గానికి లోనయ్యానని తెలిపాడు. మైదానంలో ఉండకపోయినా జట్టు కోసం ఆతృతగా ఎదురుచూడడం చాలా కష్టమని అన్నాడు. ఆ మ్యాచ్‌లో భారత్ 160 పరుగుల లక్ష్యం తో బరిలోకి దిగగా ఒక దశలో 31 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ సమయంలో విరాట్ కోహ్లి ఆడిన అద్భుత ఇన్నింగ్స్ మ్యాచ్‌ను మలుపుతిప్పింది. ఓడిపోయే స్థితి నుంచి జట్టును గెలిపించిన కోహ్లి ప్రదర్శన క్రికెట్ చరిత్రలో వేదికపై అలాంటి విజయం సాధించడం చాలా ప్రత్యేకమని అభివర్ణించాడు. ఇటీవలే టీ20 ఫార్మాట్ నుంచి విరమణ ప్రకటించిన రోహిత్, తాను ఆడిన ప్రతి అంతర్జాతీయ మ్యాచ్‌కు ముందు టెన్షన్ అనుభవించే వాడినని వెల్లడించాడు. అదే తన విజయాలకు కారణమైందని రోహిత్ వ్యాఖ్యానించాడు.

## విండీస్‌పై విజయం.. ఇంపాక్ట్ ప్లేయర్ ఎవరు?



**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 దశలో విండీస్‌పై భారత్ ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సెమీస్‌కు అర్హత సాధించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ కీలక పోరులో ఓపెనర్ సంజు శాంసన్ 97 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. అతని ప్రదర్శనకు గుర్తింపుగా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే జట్టు మేనేజ్‌మెంట్ ప్రతి మ్యాచ్ అనంతరం అందించే ప్రత్యేక 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' పతకం ఈసారి వేగ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు దక్కింది. కీలక సమయంలో ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి విండీస్ దూకుడును అడ్డుకోవడంలో బుమ్రా కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా షిమ్రోన్ హెట్‌మయెర్, రోస్టన్ ఛేజ్ వికెట్లను వరుసగా పడగొట్టి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. మ్యాచ్ అనంతరం బుమ్రా తన భార్య, వ్యాఖ్యాత సంజనా గణేశన్తో మాట్లాడాడు. ఈ సందర్భంగా సంజు శాంసన్ కష్టపాటు, పట్టుదలపై ప్రశంసలు కురిపించాడు. అయితే జట్టు మేనేజ్‌మెంట్ ప్రతి మ్యాచ్ అనంతరం అందించే ప్రత్యేక 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' పతకం ఈసారి వేగ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు దక్కింది.

## మళ్లీ మైదానంలోకి హర్భజన్ సింగ్

**వేద న్యూస్ డెస్క్:**



భారత క్రికెట్‌లో మరోసారి అనుభవజ్ఞుడైన స్పిన్నర్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. భారత క్రికెట్ నియంత్రణ మండలి చేపట్టిన ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమంలో మాజీ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కీలక బాధ్యతలు స్వీకరించారు. మార్చి తొలి వారంలో ఐదు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిబిరంలో ఆయన యువ స్పిన్నర్లకు మార్గదర్శకత్వం చేయనున్నారు. ఈ శిబిరం ప్రధానంగా రెడ్ బాల్ ఫార్మాట్‌పై దృష్టి సారించనుంది. అండర్-19, ఇండియా-ఏ జట్లకు చెందిన ప్రతిభావంతులైన ఆటగాళ్లకు ఆఫ్ స్పిన్ బౌలింగ్‌లోని మెళకువలు, క్రమశిక్షణ, ఫ్లైట్, టర్న్, లైన్ అండ్ లెంగ్త్ వంటి అంశాలపై లోతైన శిక్షణ ఇవ్వనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించగల నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యంగా భావిస్తున్నారు. ఇప్పటికే వేగ బౌలర్లకు జహీర్ ఖాన్ శిక్షణ ఇస్తుండగా, రిస్ట్ స్పిన్నర్ల కోసం ప్రత్యేక శిబిరాన్ని అనిల్ కుంబ్లే నిర్వహించే అవకాశముందని తెలుస్తోంది. మొత్తం కార్యక్రమాన్ని మాజీ దిగ్గజ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ సమన్వయం చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073